సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

గురువారం । 21 । ఆగస్టు । 2025



దర్జాగా ప్రభుత్వ భూమి కబ్జా

బద్వేలు నియోజకవర్గం ఎస్.వెంకటాపురం రెవెన్యూ పరిధిలోని పది ఎకరాల ప్రభుత్వ భూమిలో టీడీపీ కార్యకర్త యంత్రాలతో చదును చేస్తున్నాడు. -8లో



మిస్సింగ్ కేసులకు అత్యధిక ప్రాధాన్యత

మిస్సింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి అత్యధిక ప్రాధాన్యతతో కేసులను ఛేదించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ ఈ.జి. అశోక్ కుమార్ ఆదేశించారు. -8లో

గరిష్ఠం/కనిష్ఠం
33.6/26.4

వాతావరణం

జిల్లాలో బుధవారం 26.4 - 33.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.6 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

ఐటీఐలో ప్రవేశానికి 26 తుది గడువు

కడప ఎడ్యుకేషన్: కడప ప్రభుత్వ డీఎల్‌టీసీ ఐటీఐలో మూడవ దఫా అడ్మిషన్స్‌కు ఈ నెల 26తో గడువు ముగుస్తుందని డీఎల్‌టీసీ అసిస్టెంట్ డైరెక్టర్ రత్నరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటీఐలో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మిషనిస్టు, మోటార్ మెకానిక్, టర్నర్, డీజిల్ మెకానిక్, వెల్డర్‌తోపాటు కార్పెంటర్ ట్రేడ్‌లలో సీట్లు ఉన్నాయని వివరించారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు తమ సర్టిఫికెట్స్, ఒక ఫొటో తదితర వివరాలతో ఐటీఐ సర్కిల్‌లోని ప్రభుత్వ డీఎల్‌టీసీ ఐటీఐ కార్యాలయంలో సంప్రదించాలని ఏడి రత్నరాజు తెలిపారు. వివరాలకు 85559 58200, 99482 78611 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

మైనార్టీ సెల్ కార్యాలయంలో గోల్‌మాల్ !

కడప అర్బన్: కడప నగరంలోని జిల్లా మైనార్టీ సెల్ విభాగం కార్యాలయంలో గతంలో జిల్లా అధికారిగా పనిచేసిన షేక్ ఇమ్రాన్, జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేసిన మస్తాన్‌వల్లీతో కలిసి రూ. 2కోట్ల 48 లక్షల మేరకు నిధులను స్వాహా చేసినట్లు ప్రస్తుతం జిల్లా అధికారిగా పనిచేస్తున్న షేక్ హిదాయతుల్లా ఒన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఈ మేరకు పై ఇద్దరిపైనా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కడప ఒన్ టౌన్ సీఐ బి. రామకృష్ణ తెలియజేశారు.

ఏఎఫ్‌యూలో 25న కౌన్సెలింగ్

కడప ఎడ్యుకేషన్: డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో ఈ నెల 25న కౌన్సెలింగ్ ప్రారంభమవుతుందని విశ్వ విద్యాలయం వీసీ విశ్వనాథకుమార్ తెలిపారు. ఇందులో భాగంగా బీఎఫ్ఏ (ఫోర్ ఇయర్స్ డిగ్రీ) ఫైన్ ఆర్ట్స్ (యానిమేషన్, అప్లైడ్ ఆర్ట్, పెయింటింగ్, ఫొటోగ్రఫీ, శిల్పం, బి.డెస్ ఇంటీరియర్ డిజైన్) కోర్సులకు కౌన్సెలింగ్ ఉంటుదని వివరించారు. దరఖాస్తు చేసుకొన్న విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో 25వ తేదీ తప్పకుండా హాజరు కావాలని తెలిపారు. ఎవరైనా దరఖాస్తు చేసుకోని వారు కూడా డైరెక్ట్ అడ్మిషన్స్ కోసం ఒరిజినల్ (అసలు ధృవపత్రాలు) సర్టిఫికెట్స్ తో హాజరుయి అదే రోజు అడ్మిషన్స్ పొందవచ్చని తెలిపారు. సమాచారం కోసం www.ysrafu.ac.inను సందర్శించాలని వీసీ విశ్వనాథ్‌కుమార్ తెలిపారు.

డీ ఫార్మసీ ప్రవేశాలకు గడువు పొడిగింపు

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్‌లలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి డి ఫార్మసీ రెండేళ్ల కోర్సులో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 23 వరకు గడువు పొడగించినట్లు ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ జ్యోతి తెలిపారు. ఈ ఫార్మసీ కోర్సు పూర్తి చేసిన వారికి వందశాతం ఉపాధి, ఉద్యోగ అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు తప్పక పదో తరగతి, ఇంటర్ మార్కుల జాబితాలు, అభ్యర్థి ఫొటో, సంతకం, పేరెంట్స్ సంతకం, స్టడీ సర్టిఫికెట్, ఎస్సీ, ఎస్టీ, బీసీ సర్టిఫికెట్స్ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి రూ, 400 ఆన్‌లైన్ ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాల కోసం 94401 44057, 98853 55377 నెంబర్లను సంప్రదించాలని ప్రిన్సిపాల్ సీహెచ్ జ్యోతి తెలిపారు.

సెప్టెంబర్ 11, 12 తేదీల్లో కళా ఉత్సవ్ పోటీలు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డీఈఓ సుబ్రమణ్యం తదితరులు

రాయచోటి: ఉమ్మడి వైఎస్సార్ కడప జిల్లా స్థాయి కళా ఉత్సవ్-2025 పోటీలను రాయచోటి డైట్ ప్రాంగణంలో సెప్టెంబర్ 11, 12వ తేదీల్లో నిర్వహించనున్నట్లు అన్నమయ్య జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రమణ్యం తెలిపారు. బుధవారం డైట్‌లో దీనికి సంబంధించిన పోస్టర్లను డీఈఓ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. గాత్ర, వాయిద్య సంగీతం, నృత్యం, నాటకం, దృశ్యకళలు, సంప్రదాయ కథ చెప్పడం వంటి విభాగాలలో విద్యార్థుల ప్రతిభను వెలికితీయడం, కళా రూపాలను ప్రోత్సహించడమే ఈ పోటీల ప్రధాన ఉద్దేశమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గుర్తింపు పొందిన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న 9,10, 11,12 తరగతుల విద్యార్థులు పోటీలకు అర్హులను వివరించారు. ఇతర వివరాలకు జిల్లా నోడల్ అధికారి మడితాటి నరసింహారెడ్డి, ఫోన్ నెంబరు. 9440246825లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో డైట్ అధ్యాపకులు తిరుపతి శ్రీనివాస్, శివ భాస్కర్, వెంకట సుబ్బారెడ్డి, గిరిబాబు యాదవ్, కేదర్నాథ్, శివప్రసాద్, మోహన్ నాయక్ పాల్గొన్నారు.

కుందూ పరవళ్లు

- నాలుగు గ్రామాలకు నిలిచిపోయిన రాకపోకలు



పెద్దముడియం బ్రిడ్జి వద్ద కాపల కాస్తున్న వీఆర్‌ఏ

మైలవరం(పెద్దముడియం): కుందూ నది ఉగ్ర రూపం దాల్చింది. అల్పపీడన ప్రభావంతో ఎగువ కురిసిన భారీ వర్షాలకు వరద పోటెత్తింది. ఫలితంగా కుందూలో వేల క్యూసెక్కుల వరద నీరు ప్రవహిస్తోంది. పెద్దముడియం మండల పరిధిలోని కుందూ పరివాహక ప్రాంతాలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. ఇప్పటికే పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ముఖ్యంగా నెమళ్లదిన్నె బ్రిడ్జిపై రెండు అడుగుల మేర నీరు ప్రవహిస్తుండటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారి గుండా జంగాలపల్లి, ఉప్పలూరు, జె.కొట్టాలపల్లి, బలపనూరు గ్రామాలకు జమ్మలమడుగు ప్రజలతో సంబంధాలు తెగిపోయాయి. జమ్మలమడుగుకు రావాలంటే సుమారు 30 కిలోమీటర్ల దూరం తిరిగి చేరుకుంటున్నారు. అలాగే నెమళ్లదిన్నెకు సంబంధించిన చాలా మంది రైతులు కుందూకు అటువైపు పొలాలు ఎక్కువగా ఉన్నాయి. కిలోమీటర్ దూరంలోని పొలానికి వెళ్లాలన్న 20 కిలోమీటర్ల దూరాన్ని చుట్టి వెళ్లాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు.

ఈతకు ఎవరూ వెళ్లవద్దు...

కుందూనది ఉధృతంగా ప్రవహిస్తుండటం వల్ల పరిసర గ్రామాల ప్రజలు ఎవరూ ఈతకు వెళ్లొద్దని ఎస్ఐ సుబ్బారావు సూచించారు. నది ప్రమాదకరంగా ప్రవహిస్తుండటంతో పరిసర గ్రామాలల్లో వీఆర్‌ఏలను కాపలా ఉంచినట్లు ఆయన తెలిపారు.



నెమళ్లదిన్నె గ్రామ బ్రిడ్జి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న కుందూ

ఉత్పత్తి హాలిడే!



- ఆర్టీపీపీలో విద్యుత్ ఉత్పత్తి నిలుపుదల
- 4 యూనిట్లలో ఉత్పత్తి నిలిపేసిన అధికారులు
- డిమాండ్ లేకపోవడమే అసలు కారణం
- 1, 6వ యూనిట్లు మాత్రమే కొనసాగిస్తున్న యంత్రాంగం

సాక్షి ప్రతినిధి, కడప: డాక్టర్ ఎంవీ రమణారెడ్డి ఆర్టీపీపీకి ఉత్పత్తి హాలిడే ప్రకటించారు. ఆరు యూనిట్లకు గాను నాలుగు యూనిట్లలో ఉత్పత్తి నిలిపేశారు. ఉత్పత్తికి తగ్గట్లు డిమాండ్ లేకపోవడమే అందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. మరోవైపు జలవిద్యుత్ ప్రాజెక్టులు నీటితో కళకళలాడుతున్నాయి. సంవృద్ధిగా నీరు ఉండడంతో హైడ్రోఎలక్ట్రానిక్ పవర్ ప్లాంట్‌లో పూర్తి స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి కొనసాగిస్తున్నారు. ఈపరిస్థితులల్లో జెన్‌కో ఉత్పత్తి తగ్గిస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు.

- ఆర్టీపీపీలో 1 నుంచి 5 యూనిట్లలో 210 మెగా వాట్ల చొప్పున 6వ యూనిట్‌లో 600 మెగా వాట్లు విద్యుత్ ఉత్పత్తి చేయనున్నారు. జన్‌కో డాక్టర్ ఎం వీఆర్ ఆర్టీపీపీ ద్వారా 1650 మెగా వాట్లు విద్యుత్ ఉత్పత్తి చేసేవారు. ఆమేరకు పూర్తి స్థాయిలో ఉత్పత్తి చేపట్టేవారు. ఇటీవల కురిసిన వర్షాలు కారణంగా ప్రధానంగా శ్రీశైలం జలవిద్యుత్ ప్రాజెక్టులో సంవృద్ధిగా నీరు చేరింది. భారీగా ఇన్‌ఫ్లో ఉండడంతో తాజాగా దిగువకు 2.5లక్షల క్యూసెక్కుల నీరు 10 గేట్లు ద్వారా విడుదల చేస్తున్నారు. మరోవైపు జల విద్యుత్ ఉత్పత్తి సైతం పూర్తి స్థాయిలో కొనసాగిస్తున్నారు. శ్రీశైలం జలవిద్యుత్ ప్రాజెక్టులో 1670 మెగా వాట్లు ఉత్పత్తి ఉంది. అందులో ఆంధ్రప్రదేశ్ 770 మెగా వాట్లు, తెలంగాణ 900 మెగా వాట్లు పూర్తి స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి చేస్తోంది. ఈ క్రమంలో జెన్‌కో ఉత్పత్తి తగ్గిస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు.

ఉత్పత్తికి తగ్గ డిమాండ్ లేకపోవడంతో...

ఆర్టీపీపీలో 1650 మెగా వాట్లు విద్యుత్ ఉత్పత్తి ఉంది. ప్రస్తుతం 2,3,4,5 యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి నిలిపేశారు. 1, 6వ యూనిట్లల్లో మాత్రమే 810 మెగా వాట్లు విద్యుత్ ఉత్పత్తిని కొనసాగిస్తున్నారు. మరో 840మెగా వాట్లు విద్యుత్ ఉత్పత్తి హాలిడే ప్రకటించారు. పైగా శ్రీశైలం జలవిద్యుత్ ఉత్పత్తి ఆంధ్రప్రదేశ్‌కు 770 మెగా వాట్లు ఉత్పత్తి ఉండడం కూడా ప్రధాన కారణం. జన్‌కో ద్వారా విద్యుత్ ఉత్పత్తికి అవకాశం ఉన్నప్పటికీ తగ్గ డిమాండ్ లేదు. ఆ మేరకు ఆర్టీపీపీలో నాలుగు యూనిట్లు నిలిపేశాం.

– వాసుదేవరావు, సీఈ, ఆర్టీపీపీ

పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు

దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాత్సవ



కడప రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనుల గురించి తెలుసుకుంటున్న జీఎం సంజయ్‌కుమార్ శ్రీ వాత్సవ

కడప కోటిరెడ్డిసర్కిల్: అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా కడప రైల్వేస్టేషన్‌లో రూ. 25 కోట్లతో జరుగుతున్న అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాత్సవ అధికారులను ఆదేశించారు. బుధవారం రేణిగుంట నుంచి గుంతకల్లుకు వెళుతూ మార్గంమధ్యలో కడపలో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనుల్లో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అనంతరం ఆయన పనుల తీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఎం చంద్రశేఖర్‌గుప్తా, సీనియర్ డీసీఎం మనోజ్, సీనియర్ డీఓఎం శ్రావణ్‌కుమార్, సీనియర్ డీఎస్‌టీఈ చంద్రశేఖర్, సీనియర్ డీఈఎన్ శ్రీనివాసులు, సీసీఐ జనార్దన్, స్టేషన్ మేనేజర్ శేఖర్ కుమార్, ఆర్‌పీఎఫ్ సీఐ కోటేశ్వరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

24 నుంచి ఒంటిమిట్టలో పవిత్రోత్సవాలు



పవిత్రోత్సవాలకు సిద్ధం చేసిన యాగశాల

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి వారి ఆలయంలో పవిత్రోత్సవాలు ఈనెల 24 నుంచి 26వ తేదీ వరకు జరుగుతాయని టీటీడీ అధికారులు బుధవారం తెలిపారు. ఇందుకోసం ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. ఆగస్టు 23వ తేది సాయంత్రం ఆరు గంటలకు అంకురార్పణతో ఈ ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు.సంప్రదాయం ప్రకారం జాతశౌచం, మృతశౌచం వంటి వేళల్లో ఆలయ ప్రవేశం నిషిద్ధమని, అయినా యాత్రికుల వల్ల, సిబ్బంది వల్ల తెలియక దోషాలు జరుగుతుంటాయని, ఇలాంటి వాటివల్ల ఆలయ పవిత్రతకు ఎలాంటి లోపం రానీయకుండా నివారించేందుకు ప్రతి ఏడాది మూడు రోజులపాటు పవిత్రోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ అని తెలిపారు. ఇందులో భాగంగా ఆగస్టు 24న ఉదయం చతుష్టానార్చన, పవిత్ర ప్రతిష్ట, సాయంత్రం పవిత్రహోమం, నివేదన, శాత్తుమొర జరుగుతాయన్నారు. 25న ఉదయం పవిత్ర సమర్పణ, సాయంత్రం యాగశాలలో వైదిక కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. 26న ఉదయం మహా పూర్ణాహుతి, పవిత్ర విసర్జన, కుంభప్రోక్ష, సాయంత్రం శ్రీ సీతా లక్ష్మణ సమేత శ్రీ కోదండరామ స్వామి ఉత్సవర్ల ఊరేగింపు జరుగుతుందని టీటీడీ అధికారులు తెలిపారు.

పూర్ణాహుతితో ముగిసిన దేవునికడప బాలాలయం



బాలాలయంలో స్వామి, అమ్మవార్ల ప్రతిష్ఠ



దర్శనానికి క్యూలో నిలిచిన భక్తులు

కడప సెవెన్‌రోడ్స్: దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం శాస్త్రోక్తంగా నిర్వహించిన పూర్ణాహుతి కార్యక్రమంతో బాలాలయ నిర్మాణం పూర్తయింది. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో ఆలయ జీర్ణోద్ధరణ పనులు చేపట్టాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా తొలి దశ కింద రూ.15 లక్షలతో బాలాలయ నిర్మాణాన్ని పూర్తి చేశారు. బుధవారం ఉదయం 9.30 గంటలకు మహాపూర్ణాహుతి, అనంతరం తులాలగ్నంలో బాలబింబ ప్రతిష్ఠ, బాలాలయ సంప్రోక్షణ కార్యక్రమాలను పాంచరాత్ర ఆగమ సలహాదారు రాజేష్ భట్టర్, మయూరం కృష్ణమోహన్, తివిక్రమ్, కృష్ణ తరుణ్ నిర్వహించారు. అనంతరం బాలాలయంలో వెలిసిన స్వామి, అమ్మవార్లను పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. కార్యక్రమాలను టీటీడీ డిప్యూటీ ఈఓ ప్రశాంతి, సూపరింటెండెంట్ హనుమంతయ్య, ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్ని మండలాల్లో సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్లు

- కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి
- 60 రోజుల్లో నిర్మాణాలు పూర్తి



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా అమలైన సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్స్ 90 రోజుల్లోనే జిల్లాలోని అన్ని మండలాల్లో అమలులోకి రానున్నామని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో యూనిక్‌గా ఏర్పాటు కానున్న సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ భవన నిర్మాణాల ప్రణాళిక, డిజైన్ల గురించి కలెక్టర్ జేసీ అదితిసింగ్‌తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా విజయ్ ఆర్కిటెక్చర్ ఇంజినీరింగ్ వారు రూపొందించిన సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ భవనాల నిర్మాణాల డిజైన్లను పవర్ పాయింట్ ద్వారా కలెక్టర్ పరిశీలించారు. నూతనంగా రూపు దిద్దుకోనున్న స్మార్ట్ కిచెన్ షెడ్ నిర్మాణాలు అన్ని మండలాల్లో ఒకే డిజైన్ తో ఉండాలని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. ఇప్పటికే కడప నగరంలో నిర్వహణలో ఉన్న స్మార్ట్ కిచెన్ రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచిందని, అదే స్ఫూర్తితో జిల్లాలోని అన్ని మండలాల్లో స్మార్ట్ కిచెన్ షెడ్లను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికను రూపొందించాలన్నారు. ఈ షెడ్ల నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించి 60 రోజుల్లో సివిల్ వర్క్ పూర్తి చేసి, మరో 15 రోజుల్లో అన్ని రకాల పరికరాలను ఏర్పాటు చేసి ట్రయిల్ రన్ నిర్వహించాలన్నారు. సీపీఓ హజరతయ్య, డీఈఓ షంషుద్దీన్, డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి, హౌసింగ్ పీడీ రాజా రత్నం, ఏడీపీ యంగ్ ప్రొఫెషనల్స్, ఎస్ఎస్ఏ, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి 12 గంటల వరకు మద్యం అమ్మకాలు



ప్రొద్దుటూరు క్రైం: నూతన బార్ పాలసీ ప్రకారం ఇక నుంచి బార్లలో అర్ధరాత్రి 12 గంటల వరకు మద్యం అమ్మకాలు జరుగుతాయని కడప ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జయరాజు తెలిపారు. డిప్యూటీ కమిషనర్, ఈఎస్ రవికుమార్ బుధవారం ప్రొద్దుటూరు ఎక్సైజ్ స్టేషన్‌కు వచ్చారు. స్థానికంగా ఉన్న పాత బార్ల యజమానులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 41 బార్లకు దరఖాస్తులు ఆహ్వానించినట్లు తెలిపారు. కడప జిల్లాలో 29, అన్నమయ్య జిల్లాలో 12 బార్లు ఉన్నాయన్నారు. ఈ నెల 26లోగా దరఖాస్తులు చేసుకోవాలని, 28న బార్లకు డ్రా తీయనున్నట్లు తెలిపారు. గతంలో ప్రొద్దుటూరులోని బార్లకు లైసెన్స్ ఫీజు రూ. 1.45 కోట్లు ఉండగా ఇప్పుడు రూ. 55 లక్షలకు తగ్గించినట్లు చెప్పారు. సమయ పాలన పాటించని మద్యం షాపులు, బార్లపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రొద్దుటూరులో గంజాయి అక్రమ రవాణా నిరోధానికి కృషి చేస్తున్న ఎక్సైజ్ సీఐ సురేంద్రారెడ్డిని అభినందించారు.

2 బార్లకు నోటిఫికేషన్ విడుదల



మాట్లాడుతున్న జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జయరాజు

కడప వైఎస్ఆర్ సర్కిల్: జిల్లాలో గీత కులాలకు సంబంధించిన 2 బార్లకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జయరాజు పేర్కొన్నారు. బుధవారం నగరంలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కడప కార్పొరేషన్ పరిధిలో -1, ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో -1 బార్ల ఏర్పాటుకు నోటిఫికేషన్ విడుదల చేశామని పేర్కొన్నారు. దరఖాస్తు రుసుం ఫీజు నాన్ రీఫండబుల్ రూ.5 లక్షలు, ప్రొసెసింగ్ ఫీజు రూ.10 వేలు కలిపి మొత్తం రూ. 5.10 లక్షలు చెల్లించాలన్నారు. దరఖాస్తులను ఈనెల 29వ తేదీ సాయంత్రం 5 గంటల లోపల చేసుకోవాలన్నారు. 30న కలెక్టర్ ఆధ్వర్యంలో డ్రా తీసి ఎంపికైన అభ్యర్థులకు సమాచారం అందిస్తామన్నారు. జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్ పాల్గొన్నారు.

ఈ క్రాప్ నమోదు షురూ

- జిల్లావ్యాప్తంగా ప్రారంభమైన ఈ పంట నమోదు
- సెప్టెంబర్ 15 వరకు నమోదుకు గడువు



వేంపల్లి మండలం కత్తలూరులో ఈ క్రాపు నమోదు చేస్తున్న అగ్రికల్చర్ అసిస్టెంట్

కడప అగ్రికల్చర్: ఖరీఫ్‌లో సాగు చేసే పంటల వివరాలను గుర్తించేందుకు చేపట్టిన 'ఈ క్రాప్' నమోదుకు ప్రభుత్వం ఎట్టకేలకు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు జిల్లా వ్యవసాయశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. ప్రభుత్వం రైతులకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అందుకోవాలంటే ప్రతి రైతు ఖచ్చితంగా ఈ - పంట నమోదు చేసుకుని ఉండాల్సిందే. లేకుంటే వ్యవసాయ పంటలకు సంబంధించిన ప్రభుత్వ పథకాలు వర్తించవు. ఈ పక్రియ ప్రస్తుతం జిల్లాలో ముమ్మరంగా జరుగుతుంది.

వ్యవసాయ, రెవెన్యూ శాఖల సమన్వయంతో...

జిల్లాలో వ్యవసాయ, రెవెన్యూశాఖల సమన్వయంతో ఈ క్రాపు నమోదుకు శ్రీకారం చుట్టారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలను రైతులు అతివృష్టి, అనావృష్టితో ఎప్పుకప్పుడు నష్టపోతున్నారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో వారు పరిహారం పొందేందుకు అధికారులు చుట్టూ తిరిగేవారు. ఈ క్రాపు నమోదుతో నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం అందించేలా గత ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ముఖ్యంగా పారదర్శకత కోసం గత వైస్సార్ ప్రభుత్వం జియో ఫిన్సింగ్ విధానం అమల్లోకి తెచ్చింది. దీంతో ఖచ్చితంగా రైతు పొలం వద్దకే వెళ్లి వివరాలను నమోదు చేస్తేనే యాప్‌లో నమోదు అవుతుంది. దీనివల్ల ప్రభుత్వానికి ఖచ్చితమైన సమాచారం చేరుతుంది. ఈ- పంట ద్వారా రైతులకు ప్రభుత్వ పథకాలు నేరుగా అందనున్నాయి.

వర్షాభావంతో తగ్గిన ఆరుతడి పంటలు...

జిల్లాలో ఆరుతడి పంటలైన మొక్కజొన్న , మినుము పంటలు అక్కడక్కడ తెడతెరిపిలేని వర్షాల కారణంగా దెబ్బతిన్నాయి. ఈ పంటలకు ఈ పంట నమోదు చేస్తేనే నష్టపరిహారం అందే అవకాశం ఉంది. రైతులందరూ తప్పకుండా తాము సాగుచేసిన ప్రతి పంటకు ఈ పంట నమోదు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

జిల్లాలో ఈ క్రాపు నమోదు పరిస్థితి ఇలా...

జిల్లావ్యాప్తంగా ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వ్యవసాయ, ఉద్యాన పంటల సాధారణ సాగు 309253.88 ఎకరాలుకాగా ఇప్పటి వరకు 58878.08 ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యాయి. ఇందులో 19వ తేదీ వరకు 30833.22 ఎకరాల్లో ఈ పంటనమోదు పూర్తయింది. ఈ క్రాపు నమోదుకు సెప్టెంబర్ 15వ తేదీ వరకు గడువు ఉంది.

ప్రతి రైతు ఈ క్రాపు చేయించుకోవాలి



ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసిన ప్రతి రైతు ఖచ్చితంగా ఈ పంట నమోదు చేయించుకోవాలి. ఈ పంట నమోదులో ఎలాంటి తప్పులు లేకుండా యంత్రాంగం ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తుంది.

– చంద్రానాయక్, జిల్లా వ్యవసాయ అధికారి

క్లుప్తంగా

నీట్ పీజీ మెడికల్ పరీక్షలో శ్రావణికి 975వ ర్యాంకు



తల్లిదండ్రులతో గజ్జల శ్రావణి

చింతకొమ్మదిన్నె : మండల పరిధిలోని బుసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన గజ్జల ఆంజనేయ రెడ్డి, గజ్జల సుమిత్ర దంపతుల కుమార్తె గజ్జల శ్రావణి 19న విడుదలైన జాతీయ స్థాయి నీట్ మెడికల్ పీజీ పరీక్షలో 627 మార్కులతో 975వ ర్యాంకు సాధించారు. ఈమె తండ్రి భాకరాపేటలోని ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

కాశినాయన : మండలంలోని సావిశెట్టిపల్లె గ్రామంలో స్థలం విషయంలో ఇరువర్గాల వారు కొట్లాడుకోవడంతో ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు బుధవారం ఎస్ఐ యోగేంద్ర తెలిపారు. వెంబడి పోలయ్య, వెంబడి సత్యరాజులు స్థలం విషయంలో గొడవ పడ్డారని, పోలయ్య వర్గంలో ఏడుగురిని, సత్యరాజు వర్గంలో 12 మందిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తికి గాయాలు..

మండలంలోని సావిశెట్టిపల్లె గ్రామానికి చెందిన విష్ణు తేజ గ్రామంలోని డంపింగ్ యార్డు వద్ద మేకలను మేపుకొంటున్నాడు. అదే సమయంలో డంపింగ్ యార్డులో శ్రీను, యువ, వినయ్‌లు మొక్కలు పెంచుతుండగా కుండీలు పగిలిపోయాయి. అక్కడే ఉన్న విష్ణు తేజ కుండీలు పగిలిపోతే ఇబ్బంది కదా అని అడిగినందుకు నువ్వు ఎవడ్రా మాకు చెప్పేందుకు అని విష్ణు తేజపై దాడి చేయడంతో తలకు గాయాలయ్యాయి. వినయ్‌తోపాటు మరో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ యోగేంద్ర తెలిపారు.

గాయపడిన యువకుడి మృతి



ఎం.నవీన్ (ఫైల్)

జమ్మలమడుగు రూరల్ : జమ్మలమడుగు– ప్రొద్దుటూరు రహదారిలో పల్సర్ బైక్‌లో ప్రొద్దుటూరుకు వెళుతుండగా రోడ్డు నిర్మాణ పనుల కోసం రోడ్డుపై నిలబెట్టిన డ్రమ్ములను ఢీకొన్న ఘటనలో మంచాల నవీన్ (20) అనే యువకుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ హైమావతి తెలిపారు. పట్టణంలోని ఎస్సీ కాలనీకి చెందిన మంచాల నవీన్ కూలి పనులు చేసుకొనేవాడు. సొంత పనుల నిమిత్తం మంగళవారం రాత్రి బైక్‌లో ప్రొద్దుటూరుకు వెళుతుండగా మార్గమధ్యంలో గొరిగెనూరు గ్రామ శివార్లలో పనుల కోసం నిలబెట్టిన డ్రమ్ములను ఢీకొన్నాడు. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది వెళ్లి ప్రొద్దుటూరుకు తరలించారు. పరిస్థితి విషమించడంతో కర్నూలుకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి తండ్రి ఓబులేసు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆమె తెలిపారు.

మార్చురీలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



ప్రొద్దుటూరు క్రైం : స్థానిక జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి(65) ఒకరు మృతి చెందాడు. రెండు రోజుల క్రితం అనారోగ్యంతో ఆస్పత్రికి వచ్చిన అతనికి జీఈ వార్డులో చేర్పించి చికిత్స అందించారు. ఈ క్రమంలో ఆరోగ్యం క్షీణించడంతో అతను మంగళవారం రాత్రి మృతి చెందాడు. మృతదేహాన్ని ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. మృతుడికి సంబంధించిన బంధువులు జిల్లా ఆస్పత్రిలో సంప్రదించాలని మార్చురీ ఇన్‌చార్జి వర్గాలు తెలిపాయి.

మిస్సింగ్ కేసులకు అత్యధిక ప్రాధాన్యత

- వినాయక చవితి ఉత్సవాల నేపథ్యంలో పటిష్ట భద్రతా చర్యలు
- క్రికెట్ బెట్టింగ్, మట్కా, గ్యాంబ్లింగ్ నిరోధంపై ప్రత్యేక దృష్టి
- బైకులపై ఓవర్ స్పీడ్, సైలెన్సర్ మార్చి తిరిగే వారు, స్టంట్స్ చేసేవారికి దండన
- నేరసమీక్షా సమావేశంలో జిల్లా ఎస్పీ ఈజీ అశోక్ కుమార్



నేర సమీక్షలో పాల్గొన్న పోలీసు అధికారులు, సిబ్బంది (ఇన్‌సెట్) మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్

కడప అర్బన్ : మిస్సింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి అత్యధిక ప్రాధాన్యతతో కేసులను ఛేదించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ ఈ.జి. అశోక్ కుమార్ ఆదేశించారు. బుధవారం స్థానిక పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిస్సింగ్ కేసులను ఛేదించేందుకోసం ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. వినాయక చవితి పండుగ నేపథ్యంలో పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. మహిళలు, బాలికలపై నేరాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్ లో ఉన్న మహిళల పట్ల జరిగిన కేసులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. శక్తి యాప్ వినియోగంపై అవగాహన కల్పించాలని, కళాశాలలు, పాఠశాలల వద్ద శక్తి టీముల ద్వారా ఈవ్ టీజింగ్ జరగకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు. డ్రోన్ కెమెరా ద్వారా నిఘా ఉంచాలని ఈవ్ టీజింగ్ చేసేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అసాంఘిక కార్యకలాపాలైన క్రికెట్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్, మట్కా జిల్లాలో ఎక్కడా జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. సైబర్ క్రైమ్, సోషల్ మీడియా కేసుల్లో నిందితులను అరెస్ట్ చేసేందుకు ప్రత్యేక పోలీస్ టీమ్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సైబర్ నేరాలపై ప్రజలను చైతన్య పరుస్తూ విస్తృతంగా అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ కార్యక్రమం లో భాగంగా పాఠశాలలు, కళాశాలల సమీపంలో పొగాకు ఉత్పత్తులు, గంజాయి, మాదక ద్రవ్యాల విక్రయాలపై సమీప దుకాణాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. గంజాయి రవాణా, విక్రయాలపై దాడులు ముమ్మరం చేయాలన్నారు. గంజాయి సేవించే అవకాశం ఉన్న శివారు ప్రాంతాలు, ఇతర ప్రదేశాల్లో డ్రోన్ కెమెరాల ద్వారా నిఘా పెంచాలని చెప్పారు. ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయాల గోడౌన్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలన్నారు. బైకులపై ఓవర్ స్పీడ్, సైలెన్సర్ మార్చి తిరిగే వారు, ప్రమాదకర స్టంట్స్ చేసే ఆకతాయిలపై చట్టపరమైన చర్యలు తీసుకుని, కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామాలపై నిరంతర నిఘా ఉంచడంతో పాటు కార్డన్ అండ్ సర్చ్ ఆపరేషన్ నిర్వహించాలని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న పలు కేసులపై నిశితంగా సమీక్ష జరిపి పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో విచారణ పురోగతిని అడిగి తెలుసుకున్నారు. విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దష్టి సారించాలన్నారు. డాబాలు, హోటళ్లు, లాడ్జీలు, బస్‌స్టాండ్లు, రైల్వే స్టేషన్‌లలో తనిఖీలు నిర్వహించాలన్నారు. దొంగతనాలు, ఇతర నేరాలు జరగకుండా పగలు, రాత్రి గస్తీని పెంచాలని ఆదేశించారు. పాత నేరస్తుల కదలికలపై నిఘా ఉంచాలని, మరోమారు నేరాలకు పాల్పడకుండా చూడాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు ఎస్.పి(పరిపాలన) కె.ప్రకాష్ బాబు , స్పెషల్ బ్రాంచ్,కడప, ప్రొద్దుటూరు, మైదుకూరు, జమ్మలమడుగు, పులివెందుల, డీటీసీ డీఎస్పీలు సుధాకర్, ఎ.వెంకటేశ్వర్లు, పి.భావన, రాజేంద్ర ప్రసాద్, వెంకటేశ్వర రావు, మురళి నాయక్, అబ్దుల్ కరీం, జిల్లాలోని సీఐలు, కడప సబ్ డివిజన్‌లోని ఎస్ఐలు పాల్గొన్నారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు.

బీజేపీకి సింగారెడ్డి రాజీనామా



రాజీనామా పత్రాన్ని చూపుతున్న సింగారెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రచార కమిటీ కన్వీనర్ సింగారెడ్డి శ్రీరామచంద్రారెడ్డి బీజేపీకి రాజీనామా చేశారు. బుధవారం కడపలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని బీజేపీ నాయకుల తీరును నిరసిస్తూ తాను బీజేపీ ప్రాథమిక , క్రియాశీలక సభ్యత్వాలతోపాటు కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రచార కమిటీ కన్వీనర్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు రాజీనామా పత్రాన్ని పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌కు ఫ్యాక్స్, వాట్సాప్ ద్వారా పంపానని వివరించారు. తాను 12 ఏళ్లుగా బీజేపీలో, అంతకుముందు 12 ఏళ్లు రైతు ఉద్యమాలను చేపట్టానని తెలిపారు. తన పదవీ కాలంలో పార్టీలో మానసిక క్షోభ అనుభవించానన్నారు. బీజేపీలో అంతర్గత ప్రజాస్వామ్యం లోపించిందని తెలిపారు. స్వార్థ రాజకీయాల కారణంగా సాధారణ నాయకులను పార్టీలో ఎదగనీయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

వైష్ణవి హత్య కేసులో కీలక మలుపు

లై డిటెక్టర్ పరీక్షకు హాజరు కావాలంటూ తల్లిదండ్రులకు నోటీసులు

జమ్మలమడుగు : గండికోటలో హత్యకు గురైన వైష్ణవి మిస్టరీని ఛేదించే విషయంలో కీలక మలుపు చోటు చేసుకుంది. పోలీసులు తల్లిదండ్రులకు లై డిటెక్టర్ పరీక్షకు హాజరు కావాలంటూ కోర్టు ద్వారా నోటీసులు అందించినట్లు సమాచారం. జూలై 14వతేదీన వైష్ణవి లోకేష్ అనే యువకుడితో కలిసి గండికోటకు వెళ్లింది. తిరిగి లోకేష్ ఒక్కడే గండికోట నుంచి బయటికి వచ్చాడు. గండికోటలో వైష్ణవి హత్యకు గురి కావడంతో మొదట పోలీసులు లోకేష్‌నే నిందితుడిగా అనుమానించారు. అయితే లోకేష్ బయటికి వచ్చిన సమయంలో లోపల బాలిక బతికే ఉందని ఆధారాలు దొరికాయి. ఆ తర్వాత కుటుంబ సభ్యులు ఈ హత్య చేయించారా లేక వారే చేశారా అన్న కోణంలో పలు మార్లు విచారణ చేపట్టినా ఎలాంటి ఆధారాలు దొరకలేదు. దీంతో కోర్టు ద్వారా (పాలిగ్రాఫ్)లై డిటెక్టర్ పరీక్షకు హాజరు కావాలంటూ జమ్మలమడుగు కోర్టు ద్వారా నోటీసులు పంపించినట్లు సమాచారం. దీంతో కుటుంబ సభ్యులను పోలీసులు విచారణ చేపట్టనున్నారు.

దివ్యాంగుల పింఛన్ల తొలగింపుపై

నిరాహార దీక్ష చేపడతా



దివ్యాంగులతో మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : రాష్ట్ర వ్యాప్తంగా దివ్యాంగుల పింఛన్ల తొలగింపుపై తాను నిరాహార దీక్ష చేపడతానని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి దివ్యాంగుల ఉసురు తప్పక తగులుతుందన్నారు. ఆయన పింఛన్లను తొలగించిన దివ్యాంగులతో కలసి బుధవారం సాయంత్రం తన స్వగృహంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాచమల్లు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా 66.39 లక్షల పింఛన్లు ఉండగా, ఇప్పుడు 62.19 లక్షల పింఛన్లు మాత్రమే ఉన్నాయని, 4.19 లక్షల పింఛన్లను ప్రభుత్వం తొలగించిందన్నారు. గత 14 నెలల్లో ప్రభుత్వం ఒక్కరికీ కొత్త పింఛన్ మంజూరు చేయలేదని పేర్కొన్నారు. అలాగే గత ఎన్నికల సందర్భంగా చంద్రబాబు 50 ఏళ్లకే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు కొత్త పింఛన్లను ఇస్తామని ఇచ్చిన హామీ ఇప్పటికీ అమలు చేయకపోవడాన్ని బట్టి పేదలపై ఆయనకు ఏ మాత్రం ప్రేమ ఉందో అర్థమవుతోందన్నారు. ప్రొద్దుటూరు నియోజకవర్గానికి సంబంధించి 581 మందికి పింఛన్లను తొలగిస్తూ అధికారులు నోటీసులు ఇచ్చారన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులను టార్గెట్ చేసి ఇబ్బందులు పెడుతుందని అనుకున్నామే కానీ ఓటేసిన సాధారణ పేదలను కూడా ఇబ్బంది పెడుతోందన్నారు.

ఆర్భాటంగా ప్రకటించిన ప్రభుత్వం

జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో మంచం మీద నుంచి లేవలేని వారికి రూ.10వేలు, పెరాలసిస్ వ్యాధి గ్రస్తులకు రూ.5వేలు పింఛన్ ఇస్తుండగా, చంద్రబాబు మంచం మీద ఉన్న వారికి రూ.15వేలు, పెరాలసిస్ వ్యాధి గ్రస్తులకు రూ.10వేలు చొప్పున పెంచుతున్నట్లు ఆర్భాటంగా ప్రకటించారని రాచమల్లు తెలిపారు. ఇప్పుడు ఈ విధంగా వికలత్వం శాతం తక్కువగా ఉందని అనలుకే ఎసరు పెట్టారన్నారు. 1998 నుంచి వరుసగా నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి, వైఎస్ రాజశేఖరరెడ్డి, చంద్రబాబు నాయుడు హయాంలో పింఛన్లు తీసుకుంటున్న దివ్యాంగులను ఇప్పుడు పింఛన్‌కు అర్హులు కాదని తొలగించడం దారుణమన్నారు. తొలగించిన పింఛన్ల ద్వారా ఏడాదికి రూ.3,600 కోట్లు ప్రభుత్వానికి మిగులుతుందన్నారు. దివ్యాంగుల నోటి కాడ అన్నం తీసిన ఈ ప్రభుత్వం పుట్టగతులు లేకుండా పోతుందని, వారి శాపనార్థాలే ప్రభుత్వాన్ని నాశనం చేస్తాయన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, కౌన్సిలర్లు వరికూటి ఓబుళరెడ్డి, చింపిరి అనిల్‌కుమార్, సత్యం పాల్గొన్నారు.

దర్జాగా ప్రభుత్వ భూమి కబ్జా



టీడీపీ కార్యకర్త చదును చేసిన భూమి



గతంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన దృశ్యం (ఫైల్)

అట్లూరు : బద్వేలు నియోజకవర్గంలో ప్రభుత్వ భూమి ఎక్కడ కనిపిస్తే అక్కడ కూటమి నాయకులు, కార్యకర్తలు వాలిపోతున్నారు. మండల పరిధిలోని ఎస్.వెంకటాపురం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 60, 61 లలో సుమారు పది ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. అయితే టీడీపీకి చెందిన ఓ కార్యకర్త గత రెండు రోజులుగా యంత్రాలతో చదును చేస్తున్నాడు. రెవెన్యూ అధికారులకు తెలిసినా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. గతంలో ఈ భూమిలో ఇది ప్రభుత్వ భూమి, ఎవరైనా ఆక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసినప్పటికీ అధికారం మాదే కదా హెచ్చరిక బోర్డులు ఏమవుతాయని అతిక్రమించి చదును చేయడం మండల ప్రజలను విస్మయానికి గురిచేసింది. గతంలో ఈ భూమి ప్రజా ప్రయోజనాల అవసరాల కోసమని కేటాయించామని, అయితే వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలోకి వచ్చిన వ్యక్తి ఈ విలువైన భూమిని ఆక్రమించడం ఏమిటని స్థానిక టీడీపీ నాయకులే ఆరోపిస్తున్నారు.

తహసీల్దార్‌కు ఫిర్యాదు..

టీడీపీ కార్యకర్త సర్వే నంబర్ 60, 61 లలో సుమారు పది ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తున్నారని బుధవారం స్థానిక తహసీల్దారుకు ఎస్.వెంకటాపురం కాలనీకి చెందిన యేసన్న, ఈశ్వరయ్య ఆధ్వర్యంలో కాలనీ వాసులు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ భూమిని కాపాడి కాలనీ వాసుల ప్రయోజనాలకు ఉంచాలని కోరారు.

తహసీల్దార్ వివరణ..

ఈ విషయమై తహసీల్దార్ సుబ్బలక్షుమ్మను వివరణ కోరగా విషయం తెలిసిన వెంటనే అక్కడికి సిబ్బందిని పంపించి పనులు నిలుపుదల చేయించామన్నారు. సంబంధిత వ్యక్తి తనకు ఆ భూమిపై హక్కు పత్రాలు ఉన్నాయని వివరణ ఇచ్చారని, సంబంధిత పత్రాలను పరిశీలించిన తర్వాత ఆర్డీఓకు నివేదిక పంపుతామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలు వచ్చేంత వరకు ఆ భూమిలో ఎలాంటి ఆక్రమణలు జరగకుండా చర్యలు చేపడతామని తెలిపారు.

శభాష్.. వివేక్

– కుందూలో కొట్టుకుపోతున్న వృద్ధురాలిని కాపాడిన యవకుడు



వృద్ధురాలిని కాపాడిన తీరును ఎస్ఐకు వివరిస్తున్న వివేక్

రాజుపాళెం : పాపం.. ఆ అవ్వకు ఎంత కష్టమొచ్చిందో.. ఎవరికీ చెప్పుకునే మార్గం లేదో.. ఏమో.. జీవితంపై విరక్తి చెంది కుందూ నదిలో దూకింది. అదే సమయంలో ఆ మార్గంలో వెళ్తున్న ఓ యువకుడు గమనించి సాహసం చేసి నీళ్లలోకి దూకి ఆమెను రక్షించాడు. వివరాలు ఇలా..

నంద్యాల జిల్లా చాగలమర్రి మండలం మల్లెవేముల గ్రామానికి చెందిన గుర్రమ్మ (68) రాజుపాళెం మండలం వెల్లాల గ్రామ సమీపంలోని కుందూనదిలో దూకేందుకు అటువైపు వెళ్లింది. అయితే ఆ సమయంలో కుమ్మరపల్లె గ్రామానికి చెందిన భజంత్రి వివేకానంద ద్విచక్ర వాహనంలో ఆ దారిలో వెళుతున్నాడు. వృద్ధురాలు నీళ్ల వైపు వెళ్తుండటం గమనించి తన వాహనాన్ని ఆపి ఆమెను అనుసరించాడు. అంతలోనే ఆమె కుందూ నది పాత వంతెన మెట్ల వద్ద నీళ్లలో కొట్టుకుపోతూ కనిపించింది. వెంటనే ఏమాత్రం ఆలోచించకుండా భారీగా ప్రవహిస్తున్న నీళ్లలోకి దూకి వృద్ధురాలిని బయటకు తీశాడు. ఎందుకు నదిలో దూకాల్సి వచ్చిందని వివేక్ ఆమెను అడుగగా సమాధానం చెప్పలేక పోయింది. ఈ విషయాన్ని ఎస్ఐ వెంకటరమణకు, సచివాలయ ఉద్యోగులకు వివేక్ తెలపడంతో వెంటనే వారంతా సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గుర్రమ్మ వివరాలను ఎస్ఐ అడిగి తెలుసుకొని కుమారులను, బంధువులను పిలిపించారు. చికిత్స నిమిత్తం చాగలమర్రిలోని ఆసుపత్రికి తరలించారు. ఆమె కోలుకోవడంతో కుమారుడు ఇంటికి తీసుకెళ్లినట్లు తెలిసింది. కాగా, వృద్ధురాలిని కాపాడిన వివేక్‌ను ఎస్ఐతో పాటు ఇన్‌చార్జి తహసీల్దార్ మనోహర్ రెడ్డి, మహిళా పోలీసు షాహిదా, సచివాలయ ఉద్యోగులు, గుర్రమ్మ బంధువులు ప్రశంసించారు.

ఫిలాటెలి స్కాలర్‌షిప్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న పోస్టల్ సూపరింటెండెంట్ రాజేష్

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కడప పోస్టల్ డివిజన్ పరిధిలో 6 నుంచి 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు దీన్‌దయాళ్ స్పర్శ యోజన ఫిలాటెలి స్కాలర్ షిప్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కడప డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ రాజేష్ తెలిపారు. బుధవారం నగరంలోని పోస్టల్ ప్రధాన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2025 –26 విద్యా సంవత్సరానికి ఈ స్కాలర్‌షిప్ పథకాన్ని ప్రకటించారన్నారు. మంచి విద్యా రికార్డు, ఫిలాటెలి అభిరుచి కలిగిన విద్యార్థులకు ఫిలాటెలి క్విజ్, ప్రాజెక్ట్ ఆధారంగా స్కాలర్‌షిప్ ఇస్తారన్నారు. నెలకు రూ. 500 చొప్పున ఏడాదికి రూ. 6 వేలు ఇస్తారన్నారు. ప్రభుత్వ లేదా గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలలో 6, 9 తరగతుల మధ్య చదువుతూ ఉండాలన్నారు. పాఠశాలలో ఫిలాటెలీ క్లబ్ సభ్యుడిగా ఉండటం లేదా వ్యక్తిగత ఫిలాటెలి డిపాజిట్ ఖాతా కలిగి ఉండాలన్నారు. ఈ ఫిలాటెలి రాత పరీక్ష సెప్టెంబర్ 30న ఉంటుందన్నారు. అర్హులైన విద్యార్థులు సెప్టెంబర్ 16 లోపల దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు పోస్టాఫీసులో సంప్రదించవచ్చన్నారు.

ఘనంగా రవీంద్రనాథ్‌రెడ్డి జన్మదిన వేడుకలు



జిల్లా పార్టీ కార్యాలయంలో పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేస్తున్న పి. రవీంద్రనాథ్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, కమలాపురం మాజీ ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి జన్మదిన వేడుకలు కడప నగరంలో ఘనంగా జరిగాయి. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి, బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషాలు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి ఆధ్వర్యంలో భారీ కేక్ తెచ్చి, గజమాల వేసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. యువజన విభాగం నగర అధ్యక్షుడు గుంటి నాగేంద్ర ఆధ్వర్యంలో భారీ కేక్ తెచ్చి ఆయనతో కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అన్ ఎయిడెడ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ తరపున వి. నాగేంద్రారెడ్డి, రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో జ్ఞాపిక అందజేశారు. ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు మాజీ చైర్మన్ పులి సునీల్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆర్. వెంకట సుబ్బారెడ్డి, మైనార్టీ నాయకుడు దస్తగిరి, పార్టీ నాయకులు ఎస్. వెంకటేశ్వర్లు, దాసరి శివప్రసాద్, టీపీ వెంకట సుబ్బమ్మ, రామ్మోహన్‌రెడ్డి, సీహెచ్ వినోద్, మేసా ప్రసాద్, షఫీవుల్లా, షేక్ షఫీ, ఆర్. చెన్నయ్య, బండి ప్రసాద్, శ్రీరంజన్‌రెడ్డి, బాలస్వామిరెడ్డి, వేణుగోపాల్ నాయక్, బీహెచ్ ఇలియాస్, త్యాగరాజు, పత్తి రాజేశ్వరి తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

విచారణకు హాజరైన మాజీ ఎమ్మెల్యే

జమ్మలమడుగు : మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి బుధవారం పోలీసుల విచారణకు హాజరయ్యారు. ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని ఈనెల 12వ తేదీన అక్రమంగా అరెస్టు చేసి పులివెందుల నుంచి కడపకు తరలిస్తున్నామని చెప్పి రూటు మార్చి ఎర్రగుంట్ల మీదుగా వెళ్తుండటంతో మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పోలీసు వాహనానికి అడ్డుపడ్డారు. దీంతో పోలీసులు సుధీర్‌రెడ్డితో పాటు మరో వంద మందిపైన కేసులు నమోదు చేస్తున్నట్లు ప్రకటించారు. తొలుత ఈనెల 16వతేదీన విచారణకు రావాలంటూ పోలీసులు నోటీసులు ఇచ్చారు. అ యితే అనారోగ్యం కారణంగా 20వతేదీ హాజరవుతానని న్యాయవాదుల ద్వారా పోలీసులకు సమాచారం ఇచ్చారు. అయితే బుధవారం పోలీసు స్టేషన్‌లో విచారణకు హాజరైన మాజీ ఎమ్మెల్యేను అధికారులు ఎవ్వరూ లేకపోవడంతో విచారించలేమని చెప్పి తిరిగి ఈనెల 25వతేదీన రావాలంటూ నోటీసులు ఇచ్చారు.

పట్టపగలే బంగారు దుకాణానికి కన్నం

– 25 తులాల బంగారు నగలు చోరీ

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని మోక్షగుండం వీధిలో పట్టపగలే బంగారు దుకాణానికి దొంగలు కన్నం వేశారు. మహబూబ్‌షరీఫ్‌కు చెందిన షాపులో సుమారు 25 తులాల మేర బంగారును ఎత్తుకెళ్లారు. పోలీసులు తెలిపిన మేరకు.. శ్రీనివాసనగర్‌కు చెందిన దరూబాయిగారి మహబూబ్‌షరీఫ్ కొన్నేళ్ల నుంచి దర్గాబజార్ సమీపంలోని మోక్షగుండం వీధిలో బంగారు నగల తయారీ షాపును నిర్వహిస్తున్నాడు. బుధవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో షెట్టర్‌కు తాళం వేసి భోజనం చేసేందుకు ఇంటికి వెళ్లాడు. తిరిగి 4.30 గంటల సమయంలో దుకాణం తెరిచేందుకు రాగా షెట్టర్ తాళం తీసి ఉంది. దీంతో పూర్తిగా షెట్టర్ తీసి చూడగా పెట్టిలో బంగారు నగలు కనిపించలేదు. నగలు తయారు చేసేందుకు కస్టమర్ల నుంచి తీసుకున్న సుమారు 25 తులాల మేర ఉన్న బంగారు కనిపించలేదు. మెయిన్ బజార్‌లోని వ్యాపారులు, స్వర్ణకారులందరూ మధ్యాహ్న సమయంలో దుకాణాలను మూసి ఇళ్లకు వెళ్తారు. ఆ సమయంలో వీధులన్నీ నిర్మానుష్యంగా ఉంటాయి. ఈ క్రమంలో దొంగలు నకిలీ తాళాలతో తాళం తీసి చోరీకి పాల్పడి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. సమాచారం అందుకున్న వన్‌టౌన్ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. క్లూస్ టీం సిబ్బంది బంగారు షాపులో వేలి ముద్రలను సేకరించారు. సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను గుర్తించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. నగల తయారీ షాపు యజమాని మహబూబ్‌షరీఫ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బనకచర్ల ప్రాజెక్టు మరో కాళేశ్వరమే

మాజీ మంత్రి డీఎల్ రవీంద్రారెడ్డి



ఖాజీపేట : ప్రభుత్వం చేపట్టబోతున్న బనకచర్ల ప్రాజెక్టు మరో కాళేశ్వరంగా మారుతుందని మాజీ మంత్రి డాక్టర్ డీఎల్ రవీంద్రారెడ్డి విమర్శించారు. ఖాజీపేటలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బనకచర్ల ప్రాజెక్టుకు సుమారు రూ.80వేల కోట్లు ఖర్చవుతుందన్నారు. చిన్న చిన్న ప్రాజెక్టులు చాలా ఉన్నాయని వాటిని పూర్తి చేయాలన్నారు. రాజోలు జలాశయం నిర్మాణానికి రూ.1,300 కోట్లు నిధులు అవసరమని చెప్పారని, దానికే నిధులు లేనప్పుడు బనకచర్ల ప్రాజెక్టుకు ఎక్కడ నుంచి వస్తాయని ప్రశ్నించారు. అన్నమయ్య జిల్లా రాజంపేట వద్ద ఉన్న అన్నమయ్య ప్రాజెక్టు మరమ్మతుల కోసం, అలాగే నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులకు నిధులు కేటాయించి పూర్తి చేయాలని సూచించారు. ప్రజల కనీస అవసరాలను ప్రభుత్వం మర్చిపోయిందన్నారు. వాట్సాప్ పాలన, క్వాంటామ్ వ్యాలీ, పీ–4, ఏఐ... ఇలా హైటెక్ ఆలోచనలు మంచివే అయినా, అమలు తీరు ఎలానో చూడాలన్నారు. ప్రభుత్వం వచ్చి రెండేళ్లవుతున్నా ఒక్క కొత్త పింఛను ఇవ్వలేదని, ఒక్క ఇల్లు కూడా కట్టలేదని విమర్శించారు. మైదుకూరు నియోజక వర్గంలో రోడ్లు దారుణంగా ఉన్నాయన్నారు. ప్రభుత్వాస్పత్రిలో మందులు సక్రమంగా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. క్షేత్ర స్థాయిలో మంత్రులు పల్లెల్లో తిరిగితే వాస్తవాలు తెలుస్తాయన్నారు. సంక్షేమ పథకాలతోపాటు ప్రజల కనీస అవసరాలను గుర్తించి పనులు చేయకపోతే కూటమి పాలన కూడా తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.